నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 23-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 169 | పేజీలు: 4 | వెల: రూ.1/-

యూపీ వేదికగా రష్యా- ఉక్రెయిన్ వివాదంపై వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:యూపీ ఎన్నికల ప్రచార వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ రష్యా- ఉక్రెయిన్ విషయాన్ని ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం యూపీలోని బహరాయిచ్‌లో జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ? భారత్ మరింత బలమైన దేశంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. అటు దేశ నాయకత్వం, ఇటు రాష్ట్ర నాయకత్వం సమర్థవంతమైన నేత భుజ స్కంధాలపై ఉండాలని పేర్కొన్నారు.'ప్రస్తుతం ప్రపంచంలో ఎంత అల్లకల్లోలం జరుగుతుందో మీరు చూస్తూనే వున్నారు. ఎప్పుడేమి జరుగుతుందో చెప్పలేని సంకట స్థితి. అందుకే భారత్ బలపడాలి కదా. ఇలా బలపడటం కేవలం భారత ప్రజల కోసమే కాదు.. ప్రపంచ మానవతా దృష్టితో చూసినా ఇది అత్యావశ్యకం. భారత్ బలపడాల్సిందే. మీరందరూ వేసే ఒక్కొక్క ఓటు భారత్‌ను బలపరుస్తుంది. కఠినమైన సమయాలు వచ్చినప్పుడు బలమైన నాయకుడే కావాలి. ఇంత పెద్ద దేశం, ఇంత పెద్ద రాష్ట్రం ఓ బలమైన, పటిష్టమైన నాయకుడి భుజ స్కంధాలపై ఉండాలి' అంటూ మోదీ వ్యాఖ్యానించారు.

వేర్పాటువాద ప్రాంతాలపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 22:: ఉక్రెయిన్ పట్ల రష్యా అవలంభిస్తున్న వైఖరిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (ఏనీవ ఃతిటవని) ఖండించారు. ఉక్రెయిన్‌లోని వేర్పాటువాద ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌ను రష్యా స్వతంత్ర ప్రాంతాలుగా గుర్తించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు ప్రాంతాల్లో ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అక్కడ పెట్టుబడులు, వాణిజ్యంపై నిషేధం విధిస్తున్నామని వెల్లడించారు. ఈమేరకు బైడెన్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం చేశారు.

ఉక్రెయిన్-రష్యా ఉద్రిక్తల నేపథ్యంలో అమెరికా జాతీయ భద్రత బృందంతో బైడెన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రష్యా, ఉక్రెయిన్ ఉద్రిక్తతలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా డొనెట్స్క్, లుహాన్స్క్‌లకు స్వతంత్ర హోదా కల్పించడం ద్వారా రష్యా అంతర్జాతీయ కట్టుబాట్లను ఉల్లంఘించిందని బైడెన్ విమర్శించారు.

కాగా, రష్యాపై కఠిన ఆంక్షలు విధిస్తామని యూరోపియన్ యూనియన్ హెచ్చరించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతిస్తామని ప్రకటించింది.

ఉక్రెయిన్ పట్ల పుతిన్ చర్యను బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ తప్పుబట్టారు. ఉక్రెయిన్‌కు అవసరమైన మేర తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పుతిన్ చర్యలపై జర్మనీ చాన్సలర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు.

తూర్పు ఉక్రెయిన్‌లోని వేర్పాటు ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తున్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రెండు ప్రాంతాలను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నామని పుతిన్ చెప్పారు. ఈ మేరకు వేర్పాటువాద నాయకులతో ఒప్పందాలపై సంతకం చేశారు. ఆ రాష్ట్రాలకు మిలటరీ సహకారం అందిస్తామన్నారు.

పిల్లల కోసం మరో టీకా

హైదరాబాద్, ఫిబ్రవరి 22: దేశంలోని పిల్లలకు మరో కరోనా టీకా అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ ఫార్మా సంస్థ 'బయలాజికల్ ఈ' అభివృద్ధి చేసిన కార్బివాక్స్ టీకాను 12-18 ఏండ్ల పిల్లలకు ఇచ్చేందుకు డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) పరిమితులతో కూడిన అత్యవసర వినియోగ అనుమతులు మంజూరు చేసింది. 12-18 ఏండ్ల పిల్లల కోసం భారత బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ టీకాకు డీసీజీఐ ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. గత నెల 3 నుంచి 15-18 ఏండ్ల పిల్లలకు ఈ టీకాను అందిస్తున్నారు.

అయితే 15 ఏండ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాగా, కార్బివాక్స్ రెండో డోసుల టీకా. 28 రోజుల వ్యవధితో రెండో డోసు ఇవ్వాల్సి ఉంటుంది. 18 ఏండ్లు నిండిన వారికోసం కార్బివాక్స్ టీకాకు గతేడాది డిసెంబర్ 28నే డీసీజీఐ అనుమతి ఇచ్చింది. మరోవైపు, నోవావాక్స్ సంస్థతో కలిసి తాము అభివృద్ధి చేసిన కొవావాక్స్ టీకాను 12-17 ఏండ్ల పిల్లలకు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) సోమవారం డీసీజీఐని కోరింది.

సర్కారు దవాఖానలో జడ్పీ చైర్‌పర్సన్ ప్రసవం..కేసీఆర్ కిట్ అందజేత

భూపాలపల్లి , ఫిబ్రవరి 22 : జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి గవర్నమెంట్ హాస్పిటల్‌లో పురుడు పోసుకొని ఆదర్శంగా నిలిచారు. మంగళవారం ఉదయం ఆమె ప్రసవం కోసం భూపాలపల్లిలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో చపండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

హాస్పిటల్ సూపరింటెండెంట్ తిరుపతి, గైనకాలజిస్టులు కట్ట శ్రీదేవి, కట్ట లావణ్య, అనస్తీషియా డాక్టర్ శ్రీకాంత్ శ్రీహర్షిణికి కేసీఆర్ కిట్ అందజేశారు. సర్కారీ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలనే తాను ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చానని హర్షిణి తెలిపారు.

నాడు సర్కారు దవాఖాన అంటే భయపడేవారని, సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందడం వల్ల క్యూ కడుతున్నారని చెప్పారు. అందరూ సర్కారీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అఫ్ఘాన్‌కు 2,500 టన్నుల గోధుమలు పంపిన భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:: తీవ్ర ఆర్థికమాంద్యంతో పాటు ఆహార కొరతను ఎదుర్కొంటున్న అఫ్ఘాన్‌ను ఆదుకునేందుకు భారత్ ముందుకు వచ్చింది. అఫ్ఘాన్‌ల ఆకలి తీర్చేందుకు 50,000 టన్నుల గోధుమలు పంపుతామని భారత్ పేర్కొన్నట్లుగానే సోమవారం మొదటి విడత కింద 2,500 టన్నుల గోధుమలను పంపించారు. గోధుమలతో లోడ్ అయిన అఫ్ఘాన్‌కు చెందిన 50 ట్రక్కులను పంజాబ్‌లోని అట్టారా సరిహద్దు వద్ద విదేశాంగ శాఖ కార్యదర్శి హర్ష వి శ్రింగ్లా జెండా ఊపి ప్రారంభించారు. ఇవి పాకిస్తాన్ మీదుగా అఫ్ఘాన్‌లోని జలాలాబాద్‌కు వెళ్తాయి. ట్రక్కులను ప్రారంభించిన కార్యక్రమంలో భారత్‌లోని అఫ్ఘాన్ అంబాసిడర్ ఫరీద్ మముంద్రయా సైతం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భారత విదేశాంగ కార్యదర్శి శ్రింగ్లా మాట్లాడుతూ "అఫ్ఘాన్‌ను మా మానవ దాతృత్వాన్ని చాటుకుంటున్నాం. 50,000 టన్నుల గోధుమలు పంపిస్తామని ముందుగా చెప్పాం. ఇందులో భాగంగా ఈరోజు 2,500 టన్నుల గోధుమలను అఫ్ఘాన్‌కు పంపాము. ప్రపంచ వ్యాప్తంగా ఆహార పంపిణీకి ఇది తోడ్పాటును అందిస్తుంది. మరో 2-3 నెలల్లో మిగతా మొత్తం గోధుమల్ని అఫ్ఘాన్‌కు పంపిస్తాం" అని అన్నారు. ఇక భారత్‌లోని అఫ్ఘాన్ అంబాసిడర్ ఫరీద్ మముంద్రయా మాట్లాడుతూ "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న అఫ్ఘాన్‌కు సాయం అందించినందుకు భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. భారత్ పంపిస్తున్న గోధుమలు అఫ్ఘాన్ ప్రజలకు నెల రోజుల్లో పంచిపెడతాం. అఫ్ఘాన్‌కు భారత్ పెద్దన్నలాగా అండగా నిలిచింది" అని అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్ అభివృద్ధి

-మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 22:: అంతర్జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వల్ల అద్భుతమైన అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. రాబోయే 200 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని ప్రగతి ప్రణాళికలు రచిస్తున్నామని వెల్లడించారు

మినీ ఎయిర్ పోర్ట్ కోసం జీఎంఆర్ సంస్థతో చర్చించామని స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ ను అతి పెద్ద మెడికల్ హబ్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. పాత కలెక్టరేట్ స్థలంలో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మిస్తాం.

భవిష్యత్తులో జెడ్పీ స్థలాన్ని కూడా మెడికల్ అదనపు సౌకర్యాల కోసం తీసుకుంటామని మంత్రి తెలిపారు. జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్ కన్న పెద్దగా కర్వెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు ఉంటాయన్నారు. రూ. 24 కోట్లతో నక్లెస్ రోడ్డు తరహాలో రోడ్డు వేస్తాం.

భారత్ మాల రోడ్డును తాత్కాలికంగా కొందరు అడ్డుకున్నా వెనకడుగు వేయబోమన్నారు. పార్టీలకు అతీతంగా ప్రగతిని చేసి చూపిద్దామన్నారు. త్వరలోనే సొంత స్థలం ఉంటే ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. ఈ పథకం కింద మహబూబ్ నగర్ కు 2000 ఇండ్లు వస్తాయన్నారు.

ఉక్రెయిన్ నుంచి భారతీయుల తరలింపు.. బయల్దేరిన ప్రత్యేక విమానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయులను వెనక్కి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాయబార కార్యాలయ సిబ్బంది సహా అక్కడ ఉన్న భారతీయులకు స్వదేశానికి తరలించే ప్రక్రియను ప్రారంభించింది. ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా మూడు రోజులపాటు ప్రత్యేక విమానాల్లో భారతీయులను ఉక్రెయిన్ నుంచి తరలించనున్నారు.

దీంతో మంగళవారం తెల్లవారుజామున ఎయిర్ ఇండియా తొలి ప్రత్యేక విమానం డ్రిమ్‌లైనర్ బీ-787 ఉక్రెయిన్ బయలుదేరింది. రెండు వందలకుపైగా సీటింగ్ కెపాసిటీ ఉన్న ఈ విమానం ఉక్రెయిన్ నుంచి ఈరోజు రాత్రి 10.30 గంటలకు ఢిల్లీ చేరుకొనున్నది.

తూర్పు ఉక్రెయిన్‌లోని వేర్పాటు ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తున్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రెండు ప్రాంతాలను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నామని చెప్పారు. ఆ రాష్ట్రాలకు మిలటరీ సహకారం అందిస్తామని పుతిన్ ప్రకటించారు. దీంతో ఇరు దేశాల మధ్య పరిస్థులు మరింత క్షణించాయి.

రష్యా చర్యపట్ల అమెరికా సహా ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రష్యా స్వతంత్ర హోదా ప్రకటించిన రెండు ప్రాంతాలపై అమెరికా ఆంక్షలు విధించింది. అక్కడ కొత్తగా పెట్టుబడులు పెట్టడం, వ్యాణిజ్యం చేయడాన్ని నిషేధిస్తున్నామని ప్రకటించింది.

మౌలిక వసతులకు అగ్రస్థానం

-విప్.ఆరెకపూడి గాంధీ

మియాపూర్,ఫిబ్రవరి 22:: నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో పూర్తి స్థాయి మౌలిక వసతులను కల్పించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. బస్తీ కాలనీ తేడా లేకుండా సమాన స్థాయిలో వాటిని అభివృద్ధి పథంలో నడిపించటమే తన ధ్యేయమన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తులసీనగర్ నుంచి హెచ్ఎంటీ హిల్స్? కమ్యూనిటీ హాల్ వరకు, హెచ్ఎంటీ శాతవాహన కాలనీల్లో రూ. 72.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి విప్ ఆరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చి తగు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, మహదేవ్, పార్టీ డివిజన్ నేతలు, మహిళా నేతలు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోల ప్రారంభం

డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీకి కేటాయించబడ్డ రెండు స్వచ్ఛ ఆటోలను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి విప్ గాంధీ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని, ప్రజలు సైతం రహదారులపై చెత్త వేయవద్దని, ఆటోలకు అందించాలని గాంధీ పిలుపునిచ్చారు.

హెచ్ఎంటీ హిల్స్?లోని రామాలయంలో ఈ సందర్భంగా విప్ గాంధీ, కార్పొరేటర్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మన ఊరు మన బడి కార్యక్రమంపై సమీక్ష

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో మన ఊరు మన బడి కార్యక్రమంపై ఎంఈవో ఆంజనేయులు, డీఈ దానయ్య, ప్రధానోపాధ్యాయులతో విప్ గాంధీ తన నివాసంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు పూర్తి స్థాయి వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు.

నియోజవకర్గంలో మొత్తం 31 పాఠశాలల్లో వసతుల నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని, నిధుల మంజూరు లభించగానే వసతుల పనులను చేపడతామన్నారు. వనరులను సద్వినియోగ పరిచి పాఠశాలలను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని విప్ గాంధీ సూచించారు.

చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి : రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:రష్యా- ఉక్రెయిన్ మధ్య వాతావరణం ముదురుతున్న నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చల ద్వారానే ఇరు దేశాలు పరిష్కారం చేసుకోవాలన్నదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఇరు దేశాలు చర్చల జరుపుకుంటూ, శాంతి స్థాపనకు కృషి చేయాలని సూచించారు. చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా శాంతి స్థాపన జరగాలన్నదే తాము కోరుకుంటున్నామని, భారత్ పంథా కూడా అదేనన్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అంతర్జాతీయ సమాజం ఇప్పటికే చొరవ తీసుకుంటోందని, అయినా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదన్నారు.

ప్రపంచ పరిణామల దృష్ట్యా చూసినా, ఇరు దేశాల మధ్య చూసినా యుద్ధం అనేది అంత శ్రేయస్కరం కాదని రాజ్‌నాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే తమకున్న సమాచారం ప్రకారం ఇదే విషయంపై రష్యా అధ్యక్షుడు పుతిన్,అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఇదే విషయంపై చర్చలు జరిపే అవకాశ ఉందని, దీని ద్వారా ఓ పరిష్కారం లభించే ఛాన్స్ ఉందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి : నివాళులర్పించిన మంత్రి, ఎంపీ

రంగారెడ్డి, ఫిబ్రవరి 22:మండలం కనకుమామిడి గేట్ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. అధికారిక కార్యక్రమం ముగించుకుని వస్తున్న మంత్రి సబితారెడ్డి,.వెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మృతదేహాల వద్ద నివాళులర్పించారు. ఆర్టీసీ బస్ ఢీకొన్న సంఘటనలో బైక్ మీద వెళ్తున్న నగరానికి చెందిన ఇరువురు మృతిచెందగా, అదే రోడ్డులో నగరం వైపునకు వెళ్తున్న మంత్రి సబితా రెడ్డి కాన్వాయ్ అపి సహాయక చర్యలు చేపట్టారు. ఎంపీ రంజిత్ రెడ్డితో కలిసి మృత దేహాలను దగ్గరుండి పోస్ట్ మార్టంకు తరలించే వరకు అక్కడే ఉన్నారు. పోలీసులకు పలు సూచనలు చేసారు. రోడ్డు ప్రమాద సంఘటనపై మంత్రి సబితా రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అల్లం నారాయణకు సతీవియోగం.. సీఎం కేసీఆర్ పరామర్శ

హైదరాబాద్, ఫిబ్రవరి 22: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సతీమణి పద్మ కన్నుమూశారు. అనారోగ్యం కారణాలతో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. పద్మ మరణంపై సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. అల్లం నారాయణను సీఎం ఫోన్‌లో పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అల్లం పద్మ సేవలను గుర్తు చేశారు.

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పద్మ మృతికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమంలో ఆమె పోషించిన పాత్రను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. అల్లం నారాయణ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

అల్లం పద్మ మృతి పట్ల స్పీకర్ పోచారం, మంత్రుల సంతాపం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సతీమణి అల్లం పద్మ మృతి పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ సంతాపం తెలిపారు.

పద్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు మంత్రులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి దేవుడు మనోధైర్యం ఇవ్వాలని వారు పేర్కొన్నారు.

ఆహ్వానము

జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

ప్రపంచరికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ

శ్రీ పాత్తూరి సుబ్బారావు రచించిన పదవ పుస్తకం 'అక్షరం అమృతం' వ్యాससంపుటి ఆవిష్కరణ

శ్రీమతి కుమ్మమూరి సుబ్బాయమ్మకు అంకితం.



ముఖ్యఅతిథి : డా॥కె.వి.రమణాచారి ఐ.ఎ.ఎస్.(రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

సభాధ్యక్షులు : శ్రీ బైసదేవదాసు
సంపాదకులు నేటినిజం దినపత్రిక

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి
అధ్యక్షులు శ్రీ త్యాగరాయ గానసభ

ఆత్మీయ అతిథి : శ్రీ రమణవెలమకన్ని
సాహితీవేత్త

శుభాకాంక్షలు : శ్రీ తంగిరాల చక్రవర్తి
కవి, రచయిత, విమర్శకులు

కవిసమ్మేళనం&
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
సాహితీకిరణం సలహాదారులు

కవి సమ్మేళనం

పాల్గొనే కవులు, కవయిత్రులు
శ్రీ మౌనశ్రీ మల్లిక్, డా॥వూసల రజనీగంగాధర్,శ్రీ రాపోలు సీతారామరాజు, ఎన్వీ రఘువీర్ ప్రతాప్,శ్రీ నామాల రవీంద్రసూరి, శ్రీ కె.విల్సన్‌రావు, శ్రీ గజవెల్లి, శ్రీ అనంతోజు మోహనకృష్ణ,శ్రీ జెల్లి విద్యాధరరావు, శ్రీ యం.బాలగంగాధరయ్య, శ్రీమతి శైలజామిత్ర, డా॥ గురజాడ శోభాపేరిందేవి,శ్రీమతి శిష్టా మాధవి, శ్రీమతి గూడూరి విజయలక్ష్మి, శ్రీమతి టి.వి.శిరీష, శ్రీమతి మధుపత్ర శైలజ, శ్రీమతి నందిమళ్ళ మాధవీ శ్రీనివాస్, శ్రీమతి యం.అరుణకుమారి

తేది:26.02.2022 సా॥5.00గం॥లకి,
వేదిక:కళా సుబ్బారావు కళావేదిక(శ్రీ త్యాగరాయ గానసభ)
చిక్కడపల్లి, హైదరాబాద్

జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
లయన్ సుబ్బలాల్ వంకటరెడ్డి
అధ్యక్షులు
లయన్ వి.వి.రాఘవరెడ్డి
కార్యదర్శి

శ్రీ త్యాగరాయ గానసభ
శ్రీమతి కళాకారద దీక్షితులు
కార్యదర్శి

చరిత్రలో నేటినిజం



కం॥ పదవులను పన్నె దెచ్చుచు
సదమల భావముల తూగి చదివిన ఆటలో
నిదుదున "ఎర్రన్నాయుడు"
మదమును ఎరిగి చాటె పూజితుడనుచై!

-రాధశ్రీ

(ఫిబ్రవరి 23 ఎర్రన్నాయుడు జయంతి...)

సెల్: 9494481210

దేశాభివృద్ధిలో 'సెంట్రల్ ఎక్సైజ్' పాత్ర అద్వితీయం

(రేపు "సెంట్రల్ ఎక్సైజ్ దినం" సందర్భంగా)

1855లో భారత దేశంలో అతి పురాతన 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్' విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. భారత రెవిన్యూ, ఆర్థిక శాఖల పరిధిలో పని చేస్తున్న సెంట్రల్ ఎక్సైజ్ లేదా సెంట్రల్ జియస్‌టి విభాగం ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ టాక్స్, కస్టమ్స్ డ్యూటీ, నార్కొటిక్స్ డ్యూటీ, జియస్‌టి లాంటి పన్నులు వసూలు చేయడంతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించే అతి ముఖ్యమైన కృషిని చేస్తున్నది. 24 ఫిబ్రవరి 1944న 'సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ చట్టం-1944' ఏర్పడిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏటా 24 ఫిబ్రవరిన దేశవ్యాప్తంగా 'సెంట్రల్ ఎక్సైజ్ డే' నిర్వహిస్తున్నారు.

ఈ రోజున సెంట్రల్ ఎక్సైజ్ శాఖ పట్ల సామాన్యులకు అవగాహన కల్పించే క్రమంలో భాగంగా సదస్సులు, కార్యశాలలు, విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, అవార్డుల ప్రదానోత్సవాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగుల సేవలను గుర్తించి, వారిని సన్మానించుకోవలసిన కనీస బాధ్యత దేశ పౌరుల మీద కూడా ఉందని మరువరాదు.

వస్తు ఉత్పత్తి పరిశ్రమల వ్యాపారాల్లో అవినీతిని కట్టడి చేయడం, పారదర్శకత పెంచడం, సత్సాంప్రదాయాలను నెలకొల్పడం, సంబంధిత చట్టాలను పటిష్టంగా అమలు చేయడం అనే గురుతర బాధ్యతలు సెంట్రల్ ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల మీద ఉంది.

ఈ శాఖలో కస్టమ్స్ ఆక్ట్-1962, కస్టమ్స్ ట్రాఫిక్ ఆక్ట్-1975, సెంట్రల్ ఎక్సైజ్ ఆక్ట్-1944 మరియు సర్వీస్ టాక్స్ ఆక్ట్ లాంటి చట్టాలను గట్టిగా అమలు చేస్తూ, లంచగొండితనాన్ని నివారించడం సమర్థవంతంగా జరగాలి. ప్రస్తుతం గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జియస్‌టి) అమలు 01 జూలై 2017 నుంచి అమలులోకి వచ్చింది. పన్నుల వసూల్లు సమర్థవంతంగా జరిగితేనే పేదరిక నిర్మూలన, విద్య, వైద్యాలకు కేటాయింపులు పెరిగి దేశసమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని నమ్మాలి. ఈ శాఖలో నీతివంతమైన సేవలను అందించిన ఉద్యోగులను సన్మానించుకోవాలి. భారత ప్రభుత్వంలోని అన్ని శాఖలు బాధ్యతగా సేవలందిస్తేనే దేశం అభివృద్ధి పథంలో పయనించి స్వర్ణభారత నిర్మాణం సుసాధ్యమవుతుంది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ముషీరాబాద్‌లో మహిళా కళాశాల ఏర్పాటు: ఎమ్మెల్యే

హైదరాబాద్, ఫిబ్రవరి 22: ముషీరాబాద్ నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా నివసిస్తున్నారని, వారికి ఉన్నత విద్యనందించేందుకు ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కార్పొరేట్ స్థాయిలో మహిళా కళాశాలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెప్పారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంఓ "మన బస్తీ-మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో మహిళా కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు.నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యనందించేదుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటి ఈవో సామ్యూల్‌రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌యాదవ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠాజైసింహ, ముషీరాబాద్ రాంనగర్, భోలక్‌పూర్ డివిజన్ల టీఆర్ఎస్ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్, ఆర్. మోజేస్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండు శాతం నిధులు కేటాయించాలి: హరగోపాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 22: టీఎస్ ఆర్టీసీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతున్న నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి 2 శాతం నిధులు కేటాయించాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ రెండేళ్లుగా కరోనా ప్రభావంతో ఆర్టీసీ పూర్తిగా నష్టపోయిందన్నారు. కార్యదీక్షతో అందరూ కలిసి పోరాడితేనే ఆర్టీసీని రక్షించుకోగలమన్నారు. ఎస్‌డబ్ల్యూటీఎఫ్ కన్వీనర్ వి.ఎస్.రావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక ఉద్యమాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్‌లకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆర్టీసీకి సంబంధించిన కో-ఆపరేటివ్ సంస్థ (సీసీఎస్)ను ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు.ఆర్టీసీ జేఏసీ చైర్మన్ కె. రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రజాస్వామ్య హక్కులను పునరుద్దరించాలని, రెండు వేతన ఒప్పందాలను అమలు చేయాలని ఆరు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ కె. హనుమంతు ముదిరాజ్, కన్వీనర్ పి. కమల్‌రెడ్డి, కో-కన్వీనర్లు అబ్రహం, కె.యాదయ్య, బి. సురేష్, పి. హరికిషన్, బి. యాదగిరి, నాయకులు పాలడుగు భాస్కర్.కె. సూర్యం, కె. శ్రీనివాస్, ఆర్.డి.చంద్రశేఖర్, బోస్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపుల దొంగలను పట్టుకున్న పోలీసులు

పాలకుర్తి, ఫిబ్రవరి 22: : జనగామ జిల్లా పాలకుర్తి మండల పరిధిలోని శివార్లలో మిషన్ భగీరథ పైపులైను ఎత్తుకెళ్తున్నారన్న సమాచారంతో పాలకుర్తి ఎస్సై కొలిచలం వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన రాపోలు సాయికుమార్, రాపోలు కృష్ణ, కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన రాపోలు అంజయ్యలు ఈనెల 6న పెళ్లిళ్లకు వచ్చి 10 రోజులుగా తిరుగుతూ పాలకుర్తి మండల శివార్లలో ఉన్నటువంటి మిషన్ భగీరథ పైపులను సుమారు 80 పైపులను ఎత్తుకెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని పట్టుకొని పైపులను స్వాధీనం చేసుకున్నారు. పాలకుర్తి సీఐ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, కానిస్టేబుల్ శ్రీనివాస్, కర్ణాకర్ పాల్గొన్నారు.

వికారాబాద్ లో రోడ్డు ప్రమాదం : ఇద్దరు మృతి

రంగారెడ్డి, ఫిబ్రవరి 22:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త గడిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. గుర్తు తెలియని వాహనం బైక్ ను ఢీకొనడంతో బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మరణించినట్టు స్థానికుల సమాచారం. ఈ విషయమై పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహమ్మారి కాలంలో దేశ విద్య వ్యవస్థను కాపాడింది ఏదంటే అది డిజిటల్ కనెక్టివిటీ యే- ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విద్య మరియు నైపుణ్యం రంగాల పై కేంద్ర బడ్జెటు 2022 తాలూకు సకారాత్మకమైనటువంటి ప్రభావం అనే అంశం పై ఏర్పాటైన ఒక వెబినార్ ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత కేంద్ర మంత్రులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం మరియు పరిశోధన రంగాల కు చెందిన కీలక స్టేక్ హోల్డర్స్ కూడా పాల్గొన్నారు. బడ్జెటు కు ముందు, బడ్జెటు కు తరువాత బడ్జెటు తో సంబంధమున్న అన్ని వర్గాల తో మాట్లాడడడం మరియు చర్చించడం అనే ఒక కొత్త అభ్యాసం లో ఈ వెబినార్ ఒక భాగం గా ఉంది.

దేశ నిర్మాణ ప్రక్రియ లో యువతరాని కి ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి నొక్కి చెప్పడం ద్వారా ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని మొదలు పెట్టారు. "భారతదేశ భావి నిర్మాత గా ఉన్న మన యువత కు సాధికారిత ను కల్పించడం అంటే అది భారతదేశం భవిష్యత్తు కు సాధికారిత ను కల్పించడమే అని అర్థం" అని ఆయన అన్నారు.

బడ్జెటు 2022 లో పెద్ద పీట ను వేసిన అయిదు దృష్టికోణాల ను గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగం లో వివరించారు. ఒకటో దృష్టికోణం ఏమిటి అంటే అది నాణ్యమైన విద్య ను అందరికీ అందించడం కోసం కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. విద్య రంగం లో సామర్థ్యాల ను వృద్ధి చేయడం తో పాటు మెరుగులు దిద్దిన నాణ్యత తో విద్య బోధన ను విస్తరించడం దీని ఉద్దేశం అని ఆయన పేర్కొన్నారు. రెండో దృష్టికోణం గా నైపుణ్యాభివృద్ధి పట్ల శ్రద్ధ తీసుకోవడం జరిగింది అని ఆయన చెప్పారు. డిజిటల్ స్కిల్ ఇకోసిస్టమ్ ను ఏర్పాటు చేయడం పైన, పరిశ్రమ డిమాండు కు అనుగుణం గా నైపుణ్యాల అభివృద్ధి, ఇంకా పరిశ్రమ తో ఉత్తమమైన అనుబంధాలు.. ఈ విషయాల పై శ్రద్ధ వహించడం జరిగింది అని ప్రధాన మంత్రి అన్నారు. మూడో దృష్టికోణం ఏమిటి అంటే అది భారతదేశం యొక్క ప్రాచీన అనుభవాన్ని మరియు పట్టణ ప్రణాళిక రచన, డిజైనింగ్ సంబంధి జ్ఞానాన్ని విద్య లో చేర్చడాని కి ప్రాముఖ్యాన్ని కట్టబెట్టడమైందన్నారు. నాలుగో దృష్టికోణం ఏమిటి అంటే అది అంతర్జాతీయీకరణ కు ప్రాధాన్యాన్ని ఇవ్వడం అని స్పష్టం చేశారు. దీని లో భాగం గా ప్రపంచ శ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాలు భారతదేశం లోకి రావడం, అంతేకాక ఫిన్ టెక్ సంబంధి సంస్థల ను అక్కున చేర్చుకొనేటట్లు గా జిఐఎఫ్ టి సిటీ వంటి సంస్థ ల కు ప్రోత్సాహాన్ని అందించడం అని తెలిపారు. అయిదో దృష్టికోణం ఏమిటి అంటే అది ఏనిమేషన్ విజువల్ ఎఫెక్ట్ స్ గేమింగ్ కామిక్ (ఎవిజివి) పై శ్రద్ధ కనబరచడం అని వివరించారు. ఈ రంగం లో ఉపాధి కి భారీ అవకాశాలు ఉన్నాయి, మరి ఒక పెద్ద గ్లోబల్ మార్కెట్ దీనికై ఎదురు చూస్తోంది అని ఆయన న్నారు. "ఈ బడ్జెటు జాతీయ విద్య విధానం లక్ష్యాల ను సాకారం చేయడం లో ఎంతగానో తోడ్పడుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

మహమ్మారి కాలం లో దేశ విద్య వ్యవస్థ ను కాపాడింది డిజిటల్ కనెక్టివిటీ అని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. భారతదేశం లో డిజిటల్ మాధ్యమం పరం గా అంతరం అనేది తగ్గుతోంది అని ఆయన పేర్కొన్నారు. "నూతన ఆవిష్కరణ అనేది మన దేశం లో చాలా వర్గాల ను కలుపుకొని పోయేందుకు వీలు కల్పిస్తోంది. ఇక మరో అడుగు ముందుకు వేసి దేశం ఏకీకరణ దిశ లో పయనిస్తోంది" అని ఆయన చెప్పారు. దేశ యువత కు సాయపడటం లో ఎంతో ప్రభావాన్ని చూపగలిగిన విద్య సంబంధి మౌలిక సదుపాయాల ను ఇ-విద్య, వన్ క్లాస్ వన్ చానల్, డిజిటల్ లేబ్స్, డిజిటల్ యూనివర్శిటీస్ ఏర్పరుస్తున్నాయి అని ఆయన వివరించారు. "గ్రామాల కు, పేదల కు, దళితుల కు, వెనుకబడిన వర్గాల కు, ఇంకా ఆదివాసుల కు దేశ సామాజిక-ఆర్థిక వ్యవస్థ లో విద్య కు సంబంధించిన మెరుగైన పరిష్కార మార్గాల ను చూపించేందుకు జరిగిన ఒక ప్రయత్నం ఇది" అని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయాల లో ఎదురవుతున్న సీట్ల సమస్య కు పూర్తి స్థాయి లో పరిష్కరించగల సామర్థ్యం ఇటీవల ప్రకటించిన నేషనల్ డిజిటల్ యూనివర్సిటి కి ఉంది అని ప్రధాన మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయం లో త్వరిత గతి న పని చేయవలసింది గా విద్య మంత్రిత్వ శాఖ కు, యుజిసి కి, ఎఐసిటిఇ కి, ఇంకా డిజిటల్ యూనివర్సిటి తాలూకు సంబంధిత వర్గాలన్నిటి కి ఆయన పిలుపు నిచ్చారు. సంస్థల ను ఏర్పాటు చేసే క్రమం లో అంతర్జాతీయ ప్రమాణాల ను దృష్టి లో పెట్టుకోవలసిన అవసరం ఉంది అంటూ ఆయన నొక్కిచెప్పారు.

ఈ రోజు న అంతర్జాతీయ మాతృ భాష దినం సందర్భం లో మాతృ భాష మాధ్యమం లో విద్య బోధన మరియు బాల ల మానసిక వికాసం ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి అని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావించారు. అనేక రాష్ట్రాల లో వైద్య విద్య లోను, సాంకేతిక విద్య లోను బోధన స్థానిక భాషల లో సాగుతోంది అని ఆయన ప్రస్తావించారు. డిజిటల్ ఫార్మేట్ లో ఉత్తమ కంటెంటు ను స్థానిక భారతీయ భాషల లో సృష్టించడం జోరు అందుకోవాలి అంటూ ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. ఆ తరహా కంటెంటు ఇంటర్ నెట్ లో, మొబైల్ ఫోన్ లలో, టివి లో, రేడియో లో అందుబాటు లో ఉండవలసిన అవసరం ఉంది అని ఆయన స్పష్టం చేశారు. కంటెంటు కు సంబంధించిన పని తగిన ప్రాథమ్యాల ను అనుసరించి సంజ్ఞా భాషల లో కూడా పురోగమించవలసిన అవసరం ఉంది అని ఆయన పునరుదా&ఋటించారు.

"ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రపంచ స్థాయి ప్రతిభ అవసరం అనే దృష్టి కోణం లో నుంచి చూసినప్పుడు గతిశీల నైపుణ్య సాధన అనేది ఎంతో ముఖ్యం గా ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ఉద్యోగం పరం గా మారుతూ ఉన్న పాత్ర ల డిమాండు ల మేరకు దేశం లోని జనాభా పరమైన డివిడెండు ను తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ దృష్టి కోణాన్ని ఆధారం గా చేసుకొని బడ్జెటు లో ఇ-స్కిలింగ్ లేబ్స్ ను మరియు డిజిటల్ ఇకోసిస్టమ్ ఫార్ స్కిలింగ్ ఎండ్ లైవ్ లీ హుడ్ ను గురించి ప్రకటించడమైంది అని ఆయన అన్నారు.

బడ్జెటు కు సంబంధించిన ప్రక్రియ లో ఇటీవలి మార్పు లు ఏ విధం గా బడ్జెటు ను ఒక పరివర్తనాత్మకమైన ఉపకరణం గా మార్చుతున్నదీ ప్రధాన మంత్రి తన ప్రసంగం ముగింపు లో వివరించారు. బడ్జెటు లో పేర్కొన్న అంశాల ను క్షేత్ర స్థాయి లో ఎలాంటి అంతరాయాని కీ తావు లేకుండా అమలు చేయండంటూ స్టేక్ హోల్డర్స్ ను ఆయన కోరారు. ఒక నెల రోజుల ముందుగానే బడ్జెటు ను సమర్పించడం ద్వారా దాని ని ఏప్రిల్ ఒకటో తేదీ నాటి నుంచి అమలు లోకి తీసుకు వచ్చేటట్లుగా చూడటం జరుగుతోంది, సన్నాహక చర్యలు మరియు చర్చలు ఇప్పటికే పూర్తి చేయడమైంది అని ఆయన అన్నారు. బడ్జెటు లో పేర్కొన్న అంశాల పై ఫలితాలు అత్యంత అనుకూల స్థాయి లో సిద్ధించేటట్లు చూడవలసింది గా స్టేక్ హోల్డర్స్ కు ఆయన విజ్ఞప్తి చేశారు. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మరియు జాతీయ విద్య ల కోణం లో నుంచి చూసినప్పుడు 'అమృత కాలాని' కి పునాది ని వేయడం కోసం మేము శీఘ్రం గా అమలు చేయదలచుకొన్న ఒకటో బడ్జెటు ఇది" అని ఆయన అన్నారు. "బడ్జెటు అంటే అది గణాంకాల ఖాతా ఒక్కటే కాదు, బడ్జెటు ను సరి అయిన విధం గా అమలు జరిపిన పక్షం లో అది పరిమితమైన వనరుల తో అయినా సరే గొప్ప మార్పు ను తీసుకు రాగలుగుతుంది" అని చెప్పూ, ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

దుబాయ్‌లో ఆర్గానిక్ & హార్టికల్చర్ ఉత్పత్తి ఎగుమతి సామర్థ్యాన్ని ప్రదర్శించిన భారతదేశం ఎక్స్ పో 2020

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:గ్లోబల్ మార్కెట్‌లో భారతదేశం సేంద్రీయ వ్యవసాయం, ఉద్యానవన ఉత్పత్తుల బలాన్ని అంచనా వేయడానికి, ఎక్స్ పో 2020 దుబాయ్‌లోని ఇండియా పెవిలియన్‌లో కొనసాగుతున్న 'ఆహారం, వ్యవసాయం మరియు జీవనోపాధి' పక్షంలో భాగంగా "ఇండియన్ ఆర్గానిక్ మరియు హార్టికల్చర్ సెక్టార్-మూవింగ్ అప్ ది వాల్యూ చైన్" అనే సెమినార్‌ను నిర్వహించింది. భారత వ్యవసాయ రంగం అందించే అవకాశాలు, భారీ ఎగుమతి సంభావ్యతపై చర్చించేందుకు జరిగిన సెమినార్‌లో ప్రభుత్వ ఉ ప్రైవేట్ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ పి కే స్వైన్ మాట్లాడుతూ, "'రైజింగ్ ఇండియా'లో, వ్యవసాయం అనేది భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడే ప్రధాన రంగం. 15 వ్యవసాయ-వాతావరణ మండలాలతో, సమృద్ధిగా ఉన్న నేల, ఖనిజ లవణాలు మెండుగా ఉన్న నీటి వనరులు, వైవిధ్యం మరియు నాణ్యతను కలిగి ఉంది. భారతదేశం ప్రపంచంలోని ఆహార కేంద్రంగా మారే మార్గంలో ఉంది. ప్రపంచానికి మంచి వ్యవసాయ పద్ధతులతో ఆహారం మరియు పోషక భద్రత రెండింటినీ అందిస్తోంది" అని అన్నారు. దేశంలో ఈ రంగం విస్తరణను ప్రశంసిస్తూ, "సేంద్రీయ ఉద్యానవనాల, అమోఘమైన వృద్ధి పథంతో భారతదేశం చరిత్రను లిఖిస్తోంది" అని శ్రీ స్వైన్ అన్నారు. వ్యవసాయ సరఫరా గొలుసులో పెట్టుబడులు పెట్టాలని, ఈ రంగంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌డిఐ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రపంచ పెట్టుబడిదారులను ఆయన కోరారు. భారత రాయబార కార్యాలయం, రోమ్ ఉ ఇటలీ ఉ ప్రతినిధి డాక్టర్ బి.రాజేంద్ర మాట్లాడుతూ "మా సేంద్రీయ ఉద్యానవన ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడంలో మేము చాలా కృషి చేయాలి, ఎగుమతిని విస్తరిం చడానికి అటువంటి గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రయోజనాన్ని పొందాలి అని తెలిపారు. భారతదేశంలో సేంద్రీయ మరియు ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతి సంభావ్యత గురించి వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ ప్రియా రంజన్, "మన సేంద్రీయ ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడానికి, ధృవీకరణ వ్యవస్థను కలిగి ఉండాలి. భారత ప్రభుత్వం సేంద్రీయ ఉత్పత్తుల కోసం రెండు ధృవీకరణ వ్యవస్థలను ప్రోత్సహించింది''. అని తెలిపారు. భారతీయ సేంద్రీయ మరియు ఉద్యానవన ఉత్పత్తులకు మంచి ఆమోదయోగ్యత కోసం తగిన ఫైటోసానిటరీ ప్రోటోకాల్‌లను నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. "2030 నాటికి ప్రపంచ పండ్లు మరియు కూరగాయల మార్కెట్‌లో 10% ఎగుమతి వాటాను లక్ష్యంగా చేసుకోవాలని మేము భావిస్తున్నాము" అని ఆయన చెప్పారు.మహమ్మారి ఉన్నప్పటికీ, భారతదేశ సేంద్రీయ ఎగుమతులు 2019-20 స్థాయిల కంటే 51% వృద్ధి చెందాయని సూచించడం సానుకూల పరిణామం. భారతదేశ సేంద్రీయ ఎగుమతులు 2020-21లో 8,88,180 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. భారతదేశ వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ ఆకట్టుకునే పథాన్ని హైలైట్ చేస్తూ, కేపిఎంజి భాగస్వామి, ఫుడ్ ఉ అగ్రిబిజినెస్ శ్రీ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, "వ్యవసాయంలోని మొదటి పది ఎగుమతి దేశాలలో భారతదేశం స్థానం పొందింది. మొత్తం ఎగుమతులు చాలా గణనీయమైన స్థాయిలో వృద్ధి చెందాయి. మహమ్మారి సవాళ్లు ఉన్నప్పటికీ, మేము ఈ ఘనతను సాధించగలిగాము. ఇది ప్రపంచవ్యాప్తంగా ఎగుమతిదారుగా భారతదేశం స్థానాన్ని బలోపేతం చేస్తుంది." అని చెప్పారు. సేంద్రీయ మరియు ఉద్యానవన ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఎగుమతి-కేంద్రీకృత వ్యూహంపై ఉద్ఘాటిస్తూ, "ఈ వేదిక మాకు సహాయం చేస్తోంది. ఉద్యానవన రంగంలో భారతదేశానికి ప్రాముఖ్యతనిచ్చేందుకు పెట్టుబడిదారులతో అవగాహన మరియు సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయత్నం ప్రారంభం అయింది.

ఆర్థిక, పెట్టుబడుల మార్కెట్ల అధిపతులతో చర్చించిన ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:ఆర్థిక, పెట్టుబడుల మార్కెట్‌ల (కేపిటల్ మార్కెట్) నాయకులతో కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ సోమవారం ముంబైలో ముచ్చటించారు. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు మార్గాలను అన్వేషించవలసిందిగా ఆమె పరిశ్రమ నాయకులను ఆమె కోరారు.

మహమ్మారి కాలంలో కూడా విత్త మార్కెట్లు ప్రదర్శించిన బలాన్ని గురించి ఆర్థిక మంత్రి తన తొలి వ్యాఖ్యలలో సంతృప్తిని వ్యక్తం చేశారు.

అత్యంత ప్రభావవంతమైన పద్ధతిలో ఉత్పాదక పెట్టుబడి కోసం వనరులను సరైన రీతిలో పెట్టేందుకు సమర్థత, పారదర్శకత కోసం మార్కెట్ భాగస్వాములు కృషి చేయాలని శ్రీమతి సీతారామన్ విజ్ఞప్తి చేశారు. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు విత్త మార్కెట్ పై నమ్మకం, విశ్వాసం అవసరమని ఆర్థిక మంత్రి నొక్కి చెప్పారు. విత్తమార్కెట్లను బలోపేతం, పెట్టుబడిదారులకు అనుకూలం చేసేందుకు వ్యవస్థల నిర్మాణ పోషించే ప్రముఖ పాత్రను మార్కెట్ భాగస్వాములకు శ్రీమతి సీతారామన్ పట్టి చూపారు. పెట్టుబడిదారులలో అవగాహన, కెవైసి నిబంధనలు, మ్యూచ్యువల్ ఫండ్లు చొచ్చుకుపోవడం, కార్పొరేట్ బాండ్లు బలోపేతం, సరుకు సాధికాలు (కమోడిటీ డెరివేటివ్స్), మార్కెట్ వ్యవస్థ సమర్థత గురించి వివిధ ఐడియాలను, సూచనలను వివరణాత్మకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో స్టాక్ ఎక్స్ఛేంజీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు (స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి అనుబంధంగా లావాదేవీలకు సంబంధించి పని చేసే సంస్థలు), డిపాజిటరీలు, మ్యూచ్యువల్ ఫండ్, పరిశ్రమ, స్టాక్ బ్రోకరేజ్ సంస్థలు, మర్చెంట్ బ్యాంకర్లు, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలకు సంబంధించిన అధికారులు ఉన్నారు.

ఆత్మ నిర్భర్ నార్త్ ఈస్ట్ కొత్త దృక్కోణంతో వ్యవసాయం-ఎన్ఈఆర్‌సీఆర్ఎంఎస్ చొరవ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:డియోమాలి కుగ్రామం అరుణాచల్ ప్రదేశ్‌లోని తిరప్ జిల్లాలో ఉంది, ఇక్కడ ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారు. అనుకూలమైన వ్యవసాయ-వాతావరణ పరిస్థితుల కారణంగా సుగంధ ద్రవ్యాల పెంపకం ఎన్ఈఆర్‌లో గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫిబ్రవరి 12, 2022న, నార్త్ ఈస్టర్న్ రీజియన్ కమ్యూనిటీ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొసైటీ (ఎన్ఈఆర్‌సీఆర్ఎంఎస్), షిల్లాంగ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని స్టైస్ బోర్డ్ డివిజనల్ ఆఫీస్ నంసాయ్ సహకారంతో, నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (ఎన్ఈసీ), కేంద్ర ప్రభుత్వపు మినిస్ట్రీ ఆఫ్ డోనర్ ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. పట్కాయ్ హిల్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయం, డియోమాలి, తిరప్, అరుణాచల్ ప్రదేశ్‌లో సుగంధ ద్రవ్యాల పెంపకందారులకు ఒక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 60 (అరవై) కంటే ఎక్కువ మంది పాల్గొని శిక్షణ పొందారు. వారికి సుగంధ ద్రవ్యాల పెంపకంతో పాటు తమ ఉత్పత్తులను ఆదాయం కోసం విక్రయించడంలో శిక్షణ ఇచ్చారు. రైతులు తమ వ్యవసాయ కార్యకలాపాలు మరియు ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు ప్రోత్సహించడానికి సమీప భవిష్యత్తులో నంసాంగ్ బ్లాక్ మరియు సోహో బ్లాక్‌లలో ఇటువంటి మరిన్ని ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు స్టైస్ బోర్డు అధికారులు ఈ కార్యక్రమంలో ప్రధానంగా వెలుగెత్తి తెలిపారు.

ఈసారి భక్తుల సమక్షంలోనే సీతారాముల కల్యాణం.. బ్రహ్మోత్సవాలకు రెడీ కానున్న భద్రాద్రి..

భద్రాచలం,ఫిబ్రవరి 22: భద్రాచలం సీతారాముల కల్యాణం ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరగనుంది. ఏటా లక్షలాది మంది భక్తుల సమక్షంలో కోలాహలంగా సాగే రామయ్య కల్యాణం.. కరోనా కారణంగా రెండేళ్లుగా ఏకాంతంగానే జరుగుతోంది. అయితే.. ప్రస్తుతం కరోనా ప్రభావం తగ్గిపోయిన నేపథ్యంలో ఈ సారి మాత్రం సీతా రాముల కల్యాణాన్ని భక్తుల మధ్యే నిర్వహించాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు భద్రాచలం ఈవో నుంచి అధికారికంగా ఇవ్వాల ప్రకటన వెలువడింది.

ఏప్రిల్ 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 10వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవం, 11న మహా పట్టాభిషేకం చేసి రథోత్సవం నిర్వహించనున్నారు. రాములవారి కల్యాణోత్సవానికి సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నట్లుగా భద్రాచలం ఈవో ప్రకటించారు.

కొనసాగుతున్న అనధికార విద్యుత్ కోతలు.. రైతులకు తప్పని విద్యుత్ కష్టాలు

ఒంగోలు, ఫిబ్రవరి 22: విద్యుత్ కోతలతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఎండుతున్న పంటలను కాప

బోర్డర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & మేనేజ్‌మెంట్ (బీఐఎం) అంబ్రెల్లా పథకాన్ని 2021-22 నుండి 2025-26 వరకు కొనసాగించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:2021-22 నుండి 2025-26 వరకు రూ.13,020 కోట్ల వ్యయంతో 15వ ఫైనాన్స్ కమిషన్ సైకిల్‌లో "బోర్డర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మేనేజ్‌మెంట్" (బీఎఐ) యొక్క సెంట్రల్ సెక్టార్ అంబ్రెల్లా స్కీమ్‌ను కొనసాగించడానికి మోడీ ప్రభుత్వం ఆమోదించింది. కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సరిహద్దు మౌలిక సదుపాయాలు మరియు నిర్వహణను మెరుగుపరచడానికి కట్టుబడి ఉంది. ఈ నిర్ణయం సరిహద్దు నిర్వహణ, పోలీసింగ్ మరియు సరిహద్దుల రక్షణను మెరుగుపరచడానికి సరిహద్దు మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుంది. సరిహద్దులకు కంచె, సరిహద్దు ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, సాంకేతిక పరిష్కారాలు, సరిహద్దు రోడ్లు మరియు సరిహద్దు అవుట్‌పోస్ట్‌లు (బీఓపీలు)/కంపెనీ ఆపరేటింగ్ బేస్‌లు (సీఓబీలు) వంటి మౌలిక సదుపాయాల కల్పనలో బీఎంఐ పథకం సహాయం చేస్తుంది. ఇండో-చైనా, ఇండో-నేపాల్, ఇండో-భూటాన్ మరియు ఇండో-మయన్మార్ సరిహద్దులలో ఈ తరహా కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ పథకం ఎంతగానో దోహదం చేస్తుంది.

నేడు నెల్లూరు పర్యటనకు సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 22:ఏపీ సీఎం వైఎస్ జగన్ రేపు నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్తున్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అంత్యక్రియల్లో సీఎం పాల్గొననున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి కడప వెళ్లి.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయగిరి చేరుకోనున్నారు. ఉదయగిరిలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (మెరిట్స్) వద్ద జరిగే అంత్యక్రియల్లో పాల్గొని అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకోనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఎన్ఆర్ఐ వైద్య సేవల్లో పురోగతి : సీఈఓ వెంకట్

మంగళగిరి, ఫిబ్రవరి 22: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకాని ఎన్నారై ఆసుపత్రి వైద్య సేవల్లో ఎంతో పురోగతి సాధించినట్లు సీఈఓ వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్నారై మెడికల్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. కోవిడ్ మొదటి, రెండవ, మూడవ దశల్లో రోగులకు సమర్థవంతమైన సత్వర చికిత్సను అందించినట్లు చెప్పారు. ఒకే రోజులో 900 మంది కోవిడ్ బాధితులకు వైద్యం చేశామని, ఇప్పటి వరకు 15,500 మందికి చికిత్స అందించి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. వైద్యశాలలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. 34 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ తో పాటు నూతన సూపర్ స్పెషాలిటీ ఓపీ వైద్య విభాగాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నూతనంగా వైరాలజీ ల్యాబ్ ను అందుబాటులో తీసుకువచ్చి రోగుల కోసం మూడు క్రిటికల్ కేర్ అంబులెన్స్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్నారై వైద్యశాలలో పదేళ్ల పాటు పనిచేసిన ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ బి క్యాటగిరీ మెడికల్ సీటు ప్రతి ఏడాది ఒకరికి ఉచితంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. అదనంగా 50 మందికి పైగా వైద్యులు,100మందికి పైగా నర్సులను నియమించినట్లు తెలిపారు. వార్డుల్లో రోగులందరికీ ఉచిత భోజన సదుపాయం కల్పించి, నూతనంగా మంచినీటి ట్యాంక్ ను నిర్మించినట్లు తెలిపారు. కాలేయం, గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు అనుమతులు పొందామని, దీనికి సంబంధించిన వైద్య సేవలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఐదవ అంతస్తులో అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలతో ఆపరేషన్ థియేటర్ ను నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నారై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.శ్రీనివాస్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ కుమార్ చౌదరి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.లక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శివ ప్రబోధ్, పీఆర్ఓ బొర్రా శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డుల అందజేత :

ఈ సందర్భంగా మంగళగిరిలో పనిచేస్తోన్న 42 మంది జర్నలిస్టులకు రాయితీతో కూడిన హెల్త్ కార్డులను సీఈఓ వెంకట్ అందజేశారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ? ఎన్నారై స్థాపించిన ఇన్నేళ్లలో జర్నలిస్టులను గుర్తించి ఈ ఏడాది హెల్త్ కార్డులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బి.దయాకర్, సీనియర్ జర్నలిస్టులు వి.బ్రహ్మనాయుడు, ఎస్ కృష్ణప్రసాద్, ఎం.శిరిబాబు, బి.సాంబశివరావు, ఎస్ కె సుబాని, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస కుంభకోణంలో నితీష్ కుమార్ పాత్ర నిగ్గుతేల్చాలి : ఆర్జేడీ నేత



పట్నాఫిబ్రవరి 22:,: పశుగ్రాస కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్‌కు ఐదేండ్ల జైలు శిక్ష, రూ 60 లక్షల జరిమానా విధించిన నేపథ్యంలో పశుగ్రాస కుంభకోణంలో బిహార్ సీఎం నితీష్ కుమార్‌కు కూడా ప్రమేయం ఉందని ఆర్జేడీ ఉపాధ్యక్షుడు శివానంద్ తివారీ ఆరోపించారు. పశుగ్రాస స్కాం ప్రధాన సూత్రధారి శ్యాం బిహారి సిన్హా నుంచి నితీష్ కుమార్ డబ్బు తీసుకున్నారని ఆయన ఆరోపించారు.

నితీష్ కుమార్‌కు ప్రధాని మోదీ సోషలిస్ట్ నేత సర్టిఫికెట్ ఇచ్చారని తివారీ చెప్పుకొచ్చారు. పశుగ్రాస కుంభకోణంలో నితీష్ కుమార్ పాత్ర ఉందని బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ ఆరోపించారని, జార్ఖండ్ (అప్పటి బిహార్) ట్రెజరీల నుంచి అక్రమ విత్‌డ్రాయల్స్ అనంతరం నితీష్‌కు ముడుపులు ముట్టాయని చెప్పారని తివారీ గుర్తుచేశారు. ఈ ఆరోపణలను అంగీకరించే ధైర్యం నితీష్‌కు ఉందా అని ఆయన నిలదీశారు.

మరోసారి ఇవే ఆరోపణలు చేయాలని తాను సుశీల్ మోదీకి సవాల్ విసురుతున్నానని తివారీ అన్నారు. ఈ స్కాంలో ప్రధాన సూత్రధారి శ్యాం బిహారి సిన్హాను తన జీవిత కాలంలో కలవలేదని నితీష్ చెప్పగలరా అని ప్రశ్నించారు. శ్యాం బిహారితో నితీష్‌కు సంబంధాలు ఉన్నాయని, ఈ కేసులో నితీష్‌కు డబ్బు ముట్టిందని తివారీ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో లాలూ ప్రసాద్‌కు వ్యతిరేకంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ కోర్టులో పిటిషన్ వేసిన వారిలో తాను ఒకరినని తివారీ చెప్పారు.

యువత సాధికారతతో, దేశ భవిత బలోపేతం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:జాతి నిర్మాణంలో యువతరానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతి భవిత నిర్మాణంలో కీలకపాత్ర పోషించే యువతకు సాధికరత కల్పించడమంటే, దేశ భవిష్యత్తును మరింత బలోపేతం చేయడమేనని ఆయన అన్నారు. -విద్యా, నైపుణ్య రంగాలపై 2022వ సంవత్సరపు కేంద్ర బడ్జెట్ గుణాత్మక ప్రభావం- అన్న అంశంపై ఏర్పాటు చేసిన వెబినార్ సదస్సులో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సంబంధిత రంగాల కేంద్ర మంత్రులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞాన, పరిశోధనా రంగాల భాగస్వామ్య వర్గాల ప్రతినిధులు ఈ వెబినార్ సదస్సులో పాలుపంచుకున్నారు.

2022వ సంవత్సరపు బడ్జెట్లో ప్రధానంగా ప్రస్తావించిన ఐదు అంశాలను ప్రధానమంత్రి సదస్సులో విపులంగా వివరించారు. నాణ్యమైన విద్యను సార్వత్రికం చేయడం అన్న అంశాన్ని ఆయన తన ప్రసంగంలో మొట్టమొదటగా ప్రస్తావించారు. నాణ్యమైన విద్య లక్ష్యంగా కీలకమైన నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. విద్యారంగంలో సామర్థ్యాలను ఇనుమడింపజేయడంతో పాటుగా, మెరుగుపరిచిన నాణ్యతా ప్రమాణాలతో విద్యారంగాన్ని విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇక నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై చూపుతున్న శ్రద్ధను రెండవ అంశంగా ప్రస్తావించారు. డిజిటల్ నైపుణ్యాల వ్యవస్థ ఏర్పాటు, పారిశ్రామికరంగం అవసరాలకు తగినట్టుగా, పరిశ్రమలతో మెరుగైన అనుసంధానం లక్ష్యంగా నైపుణ్యాల అభివృద్ధి తదితర అంశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

పట్టణ ప్రణాళిక, నమూనా రూపకల్పనకు సంబంధించిన గతకాలపు అనుభవాన్ని, విజ్ఞానాన్ని విద్యారంగంలో పొందుపరిచే విషయాన్ని 3వ అంశంగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ అంశానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

విద్య అంతర్జాతీయీకరణకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని మూడవ అంశంగా మోదీ ప్రస్తావించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన విదేశీ విశ్వవిద్యాలయాలను దేశానికి రప్పించడం, గిఫ్ట్ సిటీ (జి.ఐ.ఎఫ్.టి.) తరహా సంస్థలను ప్రోత్సహించడం, ఆర్థిక సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత సంస్థలను రప్పించడం తదితర అంశాలను ప్రధాని ప్రస్తావించారు.

భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి మార్కెటింగ్ అవకాశాలు ఉన్న అనిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్ (ఎ.వి.జి.సి.) రంగంపై దృష్టిని కేంద్రీకరించే విషయాన్ని ఐదవ అంశంగా ప్రధానమంత్రి ప్రస్తావించారు. "జాతీయ విద్యా విధానాన్ని సాకారం చేసుకునేందుకు ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుంది", అని ఆయన అన్నారు.

బడ్జెట్.ను ఒక పరివర్తనా ఉపకరణంగా తీర్చిదిద్దేందుకు దోహదపడే ఇటీవలి మార్పులను ప్రధానమంత్రి తన ప్రసంగం చివర్లో వివరించారు. బడ్జెట్. కేటాయింపులను క్షేత్రస్థాయిలో నిరాటంకంగా అమలు చేయాలని భాగస్వామ్య వర్గాలకు పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో బడ్జెట్ సమర్పణ ఒక నెల ముందస్తుగానే జరగడం వల్ల, ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి దాన్ని అమలు జరిపే సమయానికల్లా, అన్ని రకాల సన్నాహాలు, చర్చలు పూర్తి చేయగలుగుతున్నామని ప్రధాని అన్నారు. బడ్జెట్ కేటాయింపులనుంచి గరిష్టస్థాయి ఫలితాలను సాధించుకునేందుకు కృషి చేయాలని భాగస్వామ్య వర్గాలకు సూచించారు. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు, జాతీయ విద్యా విధానం అమలు నేపథ్యంలో అమలులోకి వచ్చిన తొలి బడ్జెట్ ఇదే. ఈ బడ్జెట్ ద్వారానే అమృత కాలం లక్ష్యంగా సత్వరం పునాదులు వేయాలని సంకల్పించాం." అని ప్రధానమంత్రి అన్నారు. "బడ్జెట్ అంటే కేవలం గణాంకాలు, లెక్కలు మాత్రమే కాదు. సక్రమంగా అమలు జరిపిన పక్షంలో బడ్జెట్ ద్వారా పరిమిత వనరులతోనే గణనీయమైన గొప్ప మార్పును తీసుకురావచ్చు" అంటూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

బడ్జెట్ అమలుకు ముందస్తుగా, బడ్జెట్. సమర్పణ తర్వాత సంబంధిత భాగస్వామ్య వర్గాలతో జరిపే చర్చలు, సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఈ వెబినార్ సదస్సును నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల, వివిధ విద్యా సంస్థల, పారిశ్రామిక రంగాల నిపుణులతో కలసి మేధోమథనం సాగించడం, వివిధ రంగాలకు సంబంధించిన అంశాల అమలులో ముందుకు సాగేందుకు తగిన వ్యూహాన్ని గుర్తించడం వంటి లక్ష్యాలతో ఈ వెబినార్ సదస్సును నిర్వహించారు. వివిధ ఇతి వృత్తాలతో ఈ వెబినార్ సదస్సులో చర్చా గోష్ఠులను చేపట్టారు. వివిధ మంత్రిత్వ శాఖల, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, పారిశ్రామిక రంగం ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సంఘాల నిపుణులు, విద్యా వేత్తలు, విద్యార్థులు, ఇతర నిపుణులు ఈ సదస్సులో పాలుపంచుకున్నారు.

వెబినార్ సదస్సుకోసం గుర్తించిన వివిధ అంశాలు:

డిజిటల్ విశ్వవిద్యాలయం:

అందరికీ అందుబాటులో ఉండేలా ప్రపంచ శ్రేణి ఉన్నత విద్యను తీర్చిదిద్దడం. అన్న ఇతివృత్తంతో జరిగిన ఈ చర్చాగోష్ఠికి కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కె. సంజయ్ మూర్తి, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి కె. రాజారామన్ సహాధ్యక్షత వహించారు. 2022 కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన డిజిటల్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన విస్తృతాంశాలపై చర్చించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో సమగ్ర విద్యా సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థను, డిజిటల్ వేదికను, పాఠ్యాంశాలను సృష్టించడం, సమర్థవంతమైన డిజిటల్ విద్యాబోధన పద్ధతులు రూపొందించడం, పటిష్టమైన శిక్షణా సిబ్బంది ఏర్పాటు, వర్చువల్ లేబరేటరీలు, డిజటల్ విద్యా బోధన, అభ్యసన వంటి అంశాలు డిజిటిల్ విశ్వవిద్యాలయం పరిధిలోకి వస్తాయి. చర్చ సందర్భంగా బహుభాషలతో కూడిన, అందుబాటులో ఉండే అధ్యయన నిర్వహణా వ్యవస్థ, అధ్యయన అనుభవాలు, పటిష్టమైన అధ్యయన సమూహాలతో తోటి అధ్యయన కర్తలను అనుసంధానం చేయడం, ఆన్ లైన్ విద్యాబోధనను, భౌతిక విద్యా విధానంతో సమ్మిళితం చేయడం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్యానెల్ చర్చలో వక్తలంతా అభిప్రాయపడ్డారు. నాణ్యమైన ఉన్నత విద్యను విస్తృతస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు డిజిటల్ విశ్వవిద్యాలయం దోహదపడుతుంది. దేశంలోని గ్రామీణ/మారుమూల/గిరిజన ప్రాంతాలకు ఇది ఎంతో ప్రయోజనకారి. బోధనా సిబ్బంది, ఫ్యాకల్టీ అభివృద్ధి ప్రక్రియలో ఏర్పడే అంతరాలను పూడ్చివేయడానికి, ఆర్థికంగా, సామాజికంగా అవకాశాలకు నోచుకోని వర్గాలను నమోదు చేయడానికి, నైపుణ్యాల ఉపాధికల్పనా సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రాంతీయ భాషల్లో నాణ్యమైన అధ్యయనా సామగ్రిని రూపొందించడానికి, నియత-అనియత విద్యా అవకాశాలకు, ఇతర సంబంధిత అంశాలకు డిజిటల్ విశ్వవిద్యాలయం ఎంతో ఉపకరిస్తుంది.

డిజిటల్ టీచర్:

సర్వీసులోని ఉపాధ్యాయులతోపాటుగా, సర్వీసు ముందస్తుగా కూడా శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. మరింత మెరుగైన అధ్యయన ఫలితాలు, నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా నాణ్యతతో కూడిన ఎలక్ట్రానిక్ పాఠ్యాంశాలు, వర్చువల్ లేబరేటరీల రూపకల్పన ప్రధానాంశాలుగా జరిగిన చర్చాగోష్ఠికి కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎ.పి. సాహ్నే, కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ కార్యదర్శి అనితా కర్వాల్ సహాధ్యక్షత వహించారు. యూనిసెఫ్ ప్రతినిధి టెర్రీ దుర్నియాన్, ప్రపంచ బ్యాంకు ప్రతినిధి డాక్టర్ షబ్నమ్ సిన్హా వక్తలుగా పాల్గొన్నారు. కోవిడ్ సంక్షోభ సమయంలో అధ్యయనా ఫలితాల పరిస్థితి గురించి వారు విపులంగా చర్చించారు.

డిజిటల్ టీచర్ వ్యవస్థ, నాణ్యమైన పాఠ్యాంశాల రూపకల్పన వంటి అంశాలనుంచి,.. డిజిటల్ ఉపకరణాలను వినియోగించేలా ఉపాధ్యాయులకు తగిన సాధికారత కల్పించడం వరకూ,..డిజిటల్ విద్యకు సంబంధించిన పలు విస్తృతాంశాలపై వారు చర్చించారు. అందరికీ విద్య అనే అంశాన్ని జాతీయ ప్రాధాన్యతతో అమలుపరిచేందుకు వీలుగా 'డిజిటల్ టీచర్స్' అనే ఉపకరణాన్ని మరింత వెసులుబాటుతో వినియోగించుకొనే మార్గాలను, ఆ ప్రయత్నంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కార పద్ధతులను, వ్యూహాలను వారు సూచించారు.

వన్ క్లాస్, వన్ చానెల్ పద్ధతిని విస్తృతం చేయడం:

అతి సుదూరమైన మారుమూల ప్రాంతాలకు కూడా నాణ్యమైన డిజిటల్ విద్యాబోధనా వ్యవస్థను చేరువగా తీసుకెళ్లడం.... ఈ అంశంపై చర్చాగోష్ఠికి ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, భాస్కరాచార్య నేషనల్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్ (బిసాజ్-ఎన్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.పి. సింగ్ సహాధ్యక్షత వహించారు. విద్యాబోధనకు సంబంధించి దేశంలో 200 విద్యాచానళ్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థ వివరాలను, సన్నాహాలను వివరిస్తూ ఒక నివేదికను డాక్టర్ టి.పి. సింగ్ సదస్సుకు సమర్పించారు. ఒకే తరగతి, ఒకే ఛానెల్ (వన్ క్లాస్, వన్ చానెల్) పద్ధతిని విస్తృతం చేసే ప్రయత్నంలో ఎదురయ్యే సవాళ్లను గురించి కూడా సదస్సులో చర్చించారు. విద్యా బోధనా పద్ధతుల అమలులో ఆవిష్కరణలను, ఈ ప్రయత్నంలో తలెత్తే సాంకేతిక నిర్వహణాపరమైన అంశాలను గురించి కూడా చర్చించారు. వందే గుజరాత్ చానెల్స్, వాటి పనితీరుపై జరిపిన అధ్యయన నివేదికను కూడా ఈ సదస్సుకు సమర్పించారు.

పట్టణ ప్రణాళిక, నమూనాల రూపకల్పనపై భారతదేశపు పరిజ్ఞానం:

ఈ చర్చాగోష్ఠికి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల కార్యదర్శి మనోజ్ జోషి సహాధ్యక్షత వహించారు. పట్టణ ప్రణాళికా రంగంలో కొత్తగా ఆవిర్భవిస్తున్న ధోరణులు, పద్ధతులు, పట్టణ ప్రణాళిక, నమూనాల రూపకల్పనకు సంబంధించి భారతదేశపు పరిజ్ఞానంపై దృష్టిని కేంద్రీకరించడం తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. పట్టణ ప్రణాళిక ద్వారా సామాజిక, ఆర్థిక లక్ష్యాలసాధనా ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానానికి మరింత ఎక్కువ ప్రమేయం, ప్రాధాన్యం కల్పించే అంశంపై నిపుణులు చర్చ జరిపారు. దేశంలో ప్రణాళికా అధ్యయన అంశాలను మరోసారి పరిశీలించవలసిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. సరైన విధానాలను సూచించి, సామర్థ్యాల నిర్మాణంపై, నైపుణ్యాభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించేలా తగిన వనరులను సృష్టించుకోవలసిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

పరిశ్రమలు, నైపుణ్యాల మధ్య అనుసంధానం పెంపొందించడం

ఈ అంశంపై జరిగిన చర్చాగోష్ఠికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, పర్యాటక శాఖ డైరెక్టర్ జనరల్ జి. కమలవర్ధన రావు, కేంద్ర పారిశ్రామిక రంగ ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య వ్యవహారాల శాఖ (డి.పి.ఐ.ఐ.టి.) కార్యదర్శి అనురాగ్ జైన్ ఉమ్మడిగా అధ్యక్షత వహించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంటర్.ప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేశ్ అగ్గర్వాల్ మాట్లాడుతూ, ఈ విషయంలో క్రియాశీలక నైపుణ్యాల వ్యవస్థ ఎంతో అవసరమని, పారిశ్రామిక అవసరాలకు, జాతీయ నైపుణ్యాల, అర్హతల వ్యవస్థకు (ఎన్.ఎస్.క్యు.ఎఫ్.) అనుగుణమైన నైపుణ్యాలు మరింత ఆవశ్యకమని చెప్పారు. కేంద్ర పర్యాటక శాఖ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ, ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు కావలసిన నైపుణ్యాభివృద్ధి అంశాలు, అవకాశాల గురించి వివరించారు.

గిఫ్ట్ సిటీలో విద్యా సంస్థల అభివృద్ధి

ఈ అంశంపై జరిగిన సదస్సుకు అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్ర ప్రాధికార సంస్థ (ఐ.ఎఫ్.ఎస్.సి.ఎ.) చైర్మన్ ఇంజేటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. గిఫ్ట్ సిటీ చైర్మన్ సుధీర్ మంకడ్ సహాధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా అనేక విస్తృతాంశాలపై చర్చ జరిగింది. గిఫ్ట్ సిటీ పరిధిలో విదేశీ సంస్థల ఏర్పాటుకు అవసరమైన పద్ధతులు, ప్రక్రియ, ప్రభుత్వ పాలనా పరమైన అంశాలు, న్యాయపరమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. రూపకల్పనా విధానాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళికను, వ్యూహాలను ప్యానెల్.లోని వక్తలు సూచించారు. భవిష్యత్తు ప్రయోజనాలకోసం ఉద్దేశించిన విద్యాబోధనా నమూనాలు దీర్ఘకాలం మనుగడ సాగించాలంటే అదుకు,.. ప్రభుత్వపరంగా, న్యాయపరంగా పటిష్టమైన వ్యవస్థ అవసరమని ఈ చర్చలో వక్తలు అభిప్రాయపడ్డారు.

అనిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ కామిక్స్ (ఎ.వి.జి.సి..)రంగంతో పరిశ్రమలు-నైపుణ్యాల అనుసంధాన్ని బలోపేతం చేయడం

ఈ అంశంపై జరిగిన చర్చా గోష్టికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాక కార్యదర్శి అపూర్వ చంద్ర, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్.పెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖ అధనపు కార్యదర్శి అతుల్ తివారీ ఉమ్మడిగా అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో అపూర్వ చంద్ర ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సారి బడ్జెట్ ప్రసంగంలో ఎ.వి.జి.సి. టాస్క్ ఫోర్స్ ఏర్పాటు అసరాన్ని ప్రస్తావించడం చాలా ప్రాముఖ్యత సంతరించుకుందని, దీనితో ఎ.వి.జి.సి. రంగం ప్రాముఖ్యతను, దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో ఆ రంగం పాత్రను ఇది తెలియజేస్తోందని అన్నారు. ఈ సదస్సులో అతుల్ తివారీ మాట్లాడుతూ,..కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ చేపట్టే వివిధ కార్యకలాపాలను వివరించారు. పి.ఎం. కౌశల్ వికాస్ యోజన, ఐ.టి.ఐ.లు, పి.ఎం. కౌశల కేంద్రాల పరిధిలో జరిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక శిక్షణ, తదతర అంశాలను ఆయన ఉదహరించారు. ఈ రంగంలో నైపుణ్యాలకు సంబంధించి ఎలాంటి అవసరాన్ని అయినా తీర్చేందుకు తాము సంసిద్ధంగా ఉన్నట్టు ఆయన హామీ ఇచ్చారు. ఎ.వి.జి.సి. రంగానికి సంబంధించి విద్యాబోధన, నైపుణ్యాలు వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ రంగానికి సంబంధించి స్కూళ్లలో తొలి వయస్సులోనే నైపుణ్యాలను అలవర్చుకోవలసిన అవసరాన్ని గురించి చర్చించారు. భవిష్యత్తులో వృద్ధి, ఉపాధి అవకాశాల సామర్థ్యం తదితర అంశాలపై కూడా ఈ సదస్సులో చర్చ జరిగింది.

వెబినార్ ముగింపు సందర్భంగా కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ మాట్లాడుతూ, ఏడు ఉప అంశాలు, ఇతివృత్తాలకు సంబంధించి పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించడం అభినందనీయమని అన్నారు. బడ్జెట్లో చేసిన వివిధ ప్రకటనల అమలుకు సంబంధించి సమగ్ర వ్యూహాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఈ వెబినార్.ను నిర్వహించినట్టు చెప్పారు. ఈ రంగంలో అమలు జరిగే సంస్కరణలను, చోటుచేసుకునే పరిణామాలను తెలుసుకునేందుకు కూడా ఈ వెబినార్ ఉపకరిస్తుందన్నారు. వివిధ భాగస్వామ్య వర్గాల ఆలోచనలనుంచి అత్యుత్తమ విధానాలను వెలికి తెచ్చేందుకు కూడా ఈ వెబినార్ దోహదపడుతుందని అన్నారు. భాగస్వామ్య వర్గాల మధ్య సమన్వయం సాధించేందుకు, అవసరమైన రంగాల ప్రాధాన్యాలను తెలుసుకునేందుకు, భవిష్యత్తుకోసం అత్యుత్తమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు కూడా ఈ వెబినార్ వీలు కలిగించిందన్నారు. ఇందుకు కృషి చేసిన భాగస్వాములకు, నిపుణులకు ఆయన అభినందనలు తెలిపారు.

కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, స్కిల్ ఇండియా పథకం కింద చేపట్టిన కార్యకలాపాలన్నింటినీ విద్యారంగంతో సమీకృతం చేసి, విద్యార్థులు నైపుణ్యాల వ్యవస్థతో సులభంగా అనుసంధానం చేయవలసిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల ద్వారా వేగంగా మారుతున్న పారిశ్రామిక అవసరాలకు తగినట్టుగా ఉపాధి కల్పన, క్రియాశీలక ఔత్సాహిక తత్వం సాధించే అవకాశం ఉండాలన్నారు. డెష్ స్టాక్ ఇ పోర్టల్ (ఆఖూఊ ూబిజీఇ.ఎ వ-జూనీతీబిజీశ్రీ) ప్రారంభంతో దేశంలో నైపుణ్యాభివృద్ధి రంగం సామర్థ్యాన్ని మనం మరింతగా పెంపొందించుకోవాలని, తద్వారా ప్రపంచ శ్రేణి సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భారతదేశం అగ్రశ్రేణిలో నిలిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

కపిలేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు షురూ..

తిరుపతి, ఫిబ్రవరి 22: తిరుపతిలోని కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. కొవిడ్ నిబంధనల మేరకు ఆలయంలో ఏకాంతంగా వాహన సేవలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణ, శంఖనాదాలు, శివనామస్

ఎమ్మెల్యేకు అభినందనలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం ముప్పు గ్రామం ఆరెపల్లి ని గెజిట్ నోటిఫికేషన్లో చేర్చడం పట్ల గ్రామ సర్పంచి నవీన్ రాజు ఎమ్మెల్యే రమేష్ బాబు కు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. గెజిట్ నోటిఫికేషన్ వలన ముప్పు గ్రామం ఆరెపల్లి కి ప్రత్యేక ప్యాకేజీలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ రాజు మాట్లాడుతూ మా గ్రామ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామం తరఫున ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు.

అవసరమైన వసతులు సమకూర్చడం సంపూర్ణ సహకారం అందిస్తాం -ఎమ్మెల్యే రమేశ్ బాబు

-100 పడకల ఏరియా ఆస్పత్రి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి):100 పడకల ఏరియా ఆసుపత్రి కమిటీ సమావేశంలో శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు పాల్గొన్నారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జరుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఇంకా అవసరమైన వసతులపై కమిటీ చర్చించడం జరిగింది. సి.టి స్కాన్ మరియు ఆక్సిజన్ ప్లాంట్ వంటి కార్యక్రమాలు పూర్తయి సిద్ధంగా ఉన్నాయని త్వరలో మంత్రి కేటీఆర్ తో ప్రారంభించుకుందామని అన్నారు. మన 100 పడకల ఆసుపత్రి సిబ్బంది గొప్పగా పనిచేస్తున్నారని వారికి ఇంకా అవసరమైన అన్ని వసతులు సమకూర్చడానికి సంపూర్ణ సహకారం అందిస్తామనిఅన్నారు. అనంతరం పట్టణ కౌన్సిలర్ సిరిగిరి చందు ఆసుపత్రికి చెత్తబుట్టలను విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , ఆర్.డి.ఓ లీలాదేవి , జిల్లా వైద్యాధికారి మురళీదర్ రావు ఆసుపత్రి సూపరిండెంట్ మహేష్ రావు , మున్సిపల్ చైర్మన్ , కమిటీ సభ్యులు మ్యాకల రవి , రాపెల్లి శ్రీధర్ , నీలం కల్యాణి , గంగం స్వరూప , తదితరులు పాల్గొన్నారు.

కిరీటం యొక్క శక్తిని ప్రదర్శించడానికి తిరిగి విచ్చేసిన ఫెమినామిస్ ఇండియా!

హైదరాబాద్, ఫిబ్రవరి 22:సంవత్సరంలో ఆసమయం మళ్ళీ రానే వచ్చింది – విధిని తిరగరాసే సమయం! మిస్ఇండియా ఆర్గనైజేషన్‌లో మేము భారతదేశ ప్రతిభను ప్రకాశింప జేయడానికి మరో అవకాశంతో తిరిగివచ్చాము. మా యువ మిస్ ఇండియా ఔత్సాహికులను ప్రోత్సహించాలని మరియు విజయాల ఎత్తులను చేరుకోవడానికి అడ్డంకులను అధిగమించడానికి వారిని ముందుకు తీసుకురావాలని మేము విశ్వసిస్తున్నాము. 'కిరీటం యొక్క శక్తి' ప్రతి ఒక్కరినీ ప్రేరేపించాలని మేము కోరుకుంటున్నాము. మిస్ ఇండియా ఆర్గనైజేషన్తనస్కాటింగ్కార్య కలాపాలను బ్యూటీ అంబాసిడర్ల ముసుగులో డిజిటల్మీడి యారంగంలో స్థలాంతరమునకు తీసుకెళుతుంది. డైనమిక్కార్మాట్‌తో ఆధారితమైన, వి.ఎల్.సి.సిఫెమినామిస్ ఇండియా 2022ని అందజేస్తుంది, యువతకు సాధికారత కల్పించడం మరియు అంతర్జాతీయ వేదికలపై భారతదేశం యొక్క అత్యుత్తమ ప్రతిభకు ప్రాతినిధ్యం వహించడం అనే దాని దృష్టిలో నిలిచిపోయింది

ఇప్పుడు రెండవసారి ఈ ప్రదర్శన కోసం దానివర్చువల్ఫార్మాట్‌లో, 28 రాష్ట్రాల నుండి ప్రతి ప్రతి నిధులను మరియు ఢిల్లీ, జమ్మూ మరియు కాశ్మీర్నుండ ఒక ప్రతినిధితో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి ఒక సామూహిక ప్రతినిధిని ఎంపిక చేయడానికి ఫిబ్రవరి14నుండి దేశ వ్యాప్తంగా అన్వేషణను ప్రారంభించింది. 31మంది ఫైనలిస్టులు. రాష్ట్ర ప్రతినిధుల ఎంపిక ప్రక్రియ నిర్దిష్ట ఆడిషన్వీడియోటాస్కుమర్పణలను మోజ్యాప్పారా మాత్రమే ఆహ్వానిస్తూ ఆన్‌లైన్ఇంటర్వ్యూ క్రియను కలిగి ఉంటుంది.

గ్లామర్మ రియు ఫ్యాషన్ప రిశ్రమలో ఐకాన్‌లుగా మారిన ప్రతిభావంతులైన యువతులజీవితాలను మార్చే దాదాపుఆరు దశాబ్దాల వారసత్వంతో, వి.ఎల్.సి.ఎ ఫెమినామిన్ ఇండియా 2022ని,సెఫోరా, మోజ్మరియు రజని గంధ పెరల్స్కి-పవర్ తోఅందజేస్తుంది, ఐకాన్‌లను సృష్టించే సంప్రదాయాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ పూనింది. ఈసారి ఆన్‌లైన్‌లో భవిష్యత్తులో దేశానికి నాయకత్వం వహించే మరియు ప్రాతినిధ్యం వహించేసామర్థ్యం ఉన్న నవతరం మహిళలకు పూర్తి హృదయపూర్వక మద్దతును అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగనుంది.

వి.ఎల్.సి.సి, బ్యూటీ మరియు వెల్‌నెస్ విభాగంలో ప్రముఖ బ్రాండ్, భారతదేశాన్ని సగర్వంగా నిలిపేందుకు రెండవ సంవత్సరం ప్రధాన భాగస్వామిగా పోటీతో కలిసి వచ్చింది. ఈ కలయిక జీవితాలనే మార్చే బ్రాండ్ గా తన లక్ష్యాన్ని వ్యూహాత్మకంగా పూర్తి చేస్తుంది, తద్వారా ఇది అవరోధరహితంగా ఖచ్చితంగా సరిపోతుంది. దరఖాస్తుదారులు తగు ఎత్తు మరియుఫిట్‌నెస్ సర్టిఫికేట్ కోసం వారి సమీపంలోని వి.ఎల్.సి.సికేంద్రాన్ని సందర్శించే అవకాశం కూడా ఉంది మరియు ప్రతిఫలంగా కొన్ని అద్భుతమైన కాంప్లిమెంటరీ సేవలను పొందండి.

ఈ ప్రదర్శన సెఫోరా – మీ స్వీయ సౌందర్యాన్ని నిర్వచించడంలో మరియు రూపొందించుకోవడంలో శక్తిని ఆనందించే బ్రాండ్ ద్వారా కో-పవర్డ్ అయి ఉంది – ఈ పోటీ సెఫోరాచే సహ-శక్తితో ఉంది.మోజ్, భారతదేశపు సంబర్వన్పార్టీవీడియో యాప్, ఔత్సాహికులకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి మరియు పోటీలో పాల్గొనడానికి వేదికను అందించడానికి కో-పవర్డ్ స్పాన్సర్‌గా భాగస్వామ్యం కలిగిఉంది. రాష్ట్ర ప్రతినిధుల ఎంపిక ప్రక్రియ నిర్దిష్ట ఆడిషన్వీడియోటాస్కుమర్పణలను మోజ్తీ యాప్పారామాత్రమే ఆహ్వానిస్తూ ఆన్‌లైన్ఇంటర్వ్యూ క్రియను కలిగి ఉంటుంది.పాల్గొనడానికి, ప్రతి దరఖాస్తుదారు మోజ్యాప్‌ని డౌన్ లోడ్చేసు కోవాలి, ప్రొఫైల్‌ని రూపొందించు కోవాలి మరియు మూడు ఆడిషన్వీడి యోలను (పరిచయం, ప్రతిబ మరియు రాంప్‌వాక్) అప్‌లోడ్చేయాలి. పూర్తయిన తర్వాత, దరఖాస్తుదారు లిలిలి.ఎతిబబతినిటతిజీ.ఇనీఎ కులాగిన్చేసి అవసరమైన వివరాలను పూరించాలి. కాబట్టి మోజ్ని జంగా ఆశావహులందరికీ వాగ్దానం చేస్తోంది – మోజ్చేయండి, హిట్ అవండి!మాకో-పవర్డ్ స్పాన్సర్, రజని గంధ పెరల్స్, మంచి తనానికి ఒక విభిన్నమైన మెరుపు ఉంటుంది మరియు ఈ సిద్ధాంతం,తమ ఉత్పత్తిని ఎంపిక చేసిన ఏలకులతో, స్వచ్ఛమైన కుంకుమ పువ్వు మరియు వెండి పూత పూసిన మంచి తనంతో మిళితం చేసితయారు చేయడాన్ని విశ్వసిస్తుంది.

దేశానికే తలమానికంగా మానేరు : మంత్రి గంగుల

కరీంనగర్ ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పై సీఎం కేసీఆర్ కు గల ప్రత్యేక ప్రేమకు నిదర్శనం మానేరు రివర్ ఫ్రంట్ అని, అతి త్వరలోనే ప్రాజెక్టు పట్టాలెక్కబోతుందన్నారు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్. మంగళవారం హైదరాబాద్ జలసౌధ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో మానేరు రివర్ ఫ్రంట్ పై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గతంలోనే 410 కోట్లు మానేరు రివర్ ఫ్రంట్ కోసం మంజూరయ్యాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు ఉన్నారని, రాబోయే బడ్జెట్లో సైతం సమర్పించాల్సిన ప్రతిపాదనలపై చర్చించామన్నారు. ప్రాజెక్టులో అంతర్భాగమైన తీగలవంతెన ప్రారంభానికి సిద్ధమైందన్నారు మంత్రి గంగుల. దాదాపు పది కిలోమీటర్ల పాటు నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులో మొదటి విడతగా 2.6 కిలోమీటర్ల మేర నిర్మాణాలకు సంబంధించిన డీఫీఆర్ పనులు పూర్తయి టెండర్లు పిలిచామని వెల్లడించారు. రిటైనింగ్ వాల్, అప్పర్ ప్రామినాడ్, లోయర్ ప్రామినాడ్ మధ్య నిర్మాణాలకు సంబంధించి సమావేశంలో కీలకంగా చర్చించామన్నారు, రాబోయే తరాలకు అందంగా మానేరు రివర్ ప్రంట్ ను రూపుదిద్దుతామన్నారు మంత్రి గంగుల కమలాకర్.

మానేరు రివర్ ప్రంట్ ప్రాజెక్టులో బోటింగ్, అమ్యూజ్ మెంట్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్, పౌంటేన్లు, చిల్డ్రన్ పార్క్, కిడ్స్ ప్లే ఏరియాలు, ఆడిటోరియం, మ్యూజియం, సీనియర్ సిటిజన్ గార్డెన్స్, ఫ్లవర్ గార్డెన్లు, రాక్ గార్డెన్లు, లేజర్ షోలు, విశాలమైన లాండ్ స్కేపింగులు, ఇంకా స్పోర్ట్ ఎన్ క్లేవ్లో బాగంగా టెన్నిస్, వాలిబాల్ ఇతర స్పోర్ట్స్ కోర్టులు, ప్రాజెక్టు పొడవునా వాకింగ్, జాగింగ్ ట్రాకులతో భారత దేశానికే తలమానికంగా మానేరు రివర్ ఫ్రంట్ రూపొందిస్తున్నామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్, టూరిజం శాఖ ఈడీ శంకర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, నాగభూషణం, కరీంనగర్ ఆర్డీవో, ఐఎన్ఐ కన్సల్టెన్సీ డైరెక్టర్ హర్ష్ గోయల్, ఇతర రాష్ట్ర, జిల్లా ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అందుకోసమైనా కాంగ్రెస్, బీజేపీలు టీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి : మంత్రి వేముల

నిజామాబాద్, ఫిబ్రవరి 22:దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న టీఆర్ఎస్ పార్టీకి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలవాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు నిచ్చారు.మంగళవారం వేల్పూరులో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదేవిధంగా పెద్దవాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి యావత్ దేశం అబ్బుర పడుతోందన్నారు. మహారాష్ట్రలోని 14 గ్రామాలకు చెందిన సర్పంచులు తమను కూడా తెలంగాణలో కలుపుకోవాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందించారని గుర్తు చేశారు.

చివరకు బీజేపి అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో అదే పార్టీకి చెందిన రాయచూరు ఎమ్మెల్యే తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇక్కడ కూడా అమలు చేయాలన్నారు. లేకపోతే తన నియోజకవర్గంను తెలంగాణ లో కలపాలని కర్ణాటక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారంటే సీఎం కేసీఆర్ ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

కేవలం మూడేండ్ల వ్యవధిలోనే ప్రపంచంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వాస్తవంగా దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, సేద్యానికి ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేకానేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు.

ఈ వాస్తవాలను బీజేపి, కాంగ్రెస్ నాయకులు గుర్తించి టీఆర్ఎస్‌కు బాసటగా నిలిచి తెలంగాణను ప్రగతిలో మరింతగా పరుగులు పెట్టించేందుకు దోహదపడాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

జెడ్పీలకు నిధులు పెంచాలని మంత్రి ఎర్రబెల్లికి వినతి



హైదరాబాద్, ఫిబ్రవరి 22:జిల్లా ప్రజా పరిషత్‌లు, మండల ప్రజా పరిషత్‌లకు ఈ బడ్జెట్‌లో గ్రాంట్‌ని పెంచాలని కోరుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును మంత్రుల నివాసంలోకలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుత బడ్జెట్ రూ. 500 కోట్ల నుంచి 750 కోట్ల వరకు పెంచాలని ఎమ్మెల్సీ మంత్రిని కోరారు. అలాగే రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఆరోగ్య కార్డుల జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ నిధుల పెంపు ద్వారా జిల్లా, మండల పరిషత్ ల పరిధిలో మరింత అభివృద్ధి చేయడానికి వీలు అవుతుందని ఆయన అన్నారు.

ఆరోగ్య బీమా కల్పించడం ద్వారా ఔఎటా లో ఉచిత వైద్యం పొందేందుకు స్థానిక ప్రజాప్రతినిధులకు వీలు కలుగుతుందని చెప్పారు.

ఈ ప్రతిపాదనను పరిశీలించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు పెరిగే విధంగా చూడాలని వినతి పత్రం అందజేశారు. కాగా మంత్రితో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ కమిషనర్ శరత్ కూడా ఉన్నారు.

ఉపాధ్యాయులు అందించే విద్యను కోట్లతో కొనలేరు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి):ఉపాధ్యాయులు అందించే విద్యను కోట్లతో కొనలేరని వేములవాడ అర్బన్ రుద్రవరం గ్రామ సర్పంచ్ ఉరి డి రాంరెడ్డి,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ అన్నారు

రుద్రవరంఎం పీ పీ ఎస్ స్కూల్ లో 5 గురు ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం జరిగిందిఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఉరిడీ రాంరెడ్డి ,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది సమాజంలో వారి ని అత్యుత్తమ స్థానంలో గురువులు తీర్చిదిద్దుతారని అన్నారు విద్యార్థులకు మంచి చదువు నేర్పించి వారు విద్యార్థు గుండెల్లో నిలిచిపోతారని అన్నారు . గత కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాల ఉపాధ్యాయులు గా ఉంటూ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చి దిద్ది బదిలీపై వెళ్లడం బాధాకరమని అయినా ఉద్యోగ ఉపాధ్యాయులకు బదిలీలు తప్పవని అని అన్నారు ముందుగా ప్రధానోపాధ్యాయురాలు .

,శ్రీలత, సన, ఉపాధ్యాయులు సర్పంచ్ ఊరడి రాంరెడ్డి పాలకవర్గం,ఎంపీటీసీ, విద్యా కమిటి చేర్మెన్ తునికి నరేష్ ఆధ్వర్యంలో.బదిలీ పై వెళ్లిన ప్రధాన ఉపాధ్యాయులు రాజేందర్ , ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ , దేవేందర్ , ఎస్సీ కాలనీ స్కూల్ హెచ్ ఎం శ్రీనివాస్ ,ఉపాధ్యాయులు బెజుగం అమరేశ్వరి కు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాడెం శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చేర్మెన్ ఊరడి ప్రవీణ్,మాజీ సర్పంచ్ పిల్లి రేణుక కనుకయ్య, వార్డ్ సభ్యులు బెజుగం మహేష్, తునికి నర్సయ్య, తునికి కనుకరాజు, అనుముల కావ్య భరత్, నడిగొట్ల స్వప్న హరికృష్ణ, మండలం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ ఎం సుహాసిని, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం భూమయ్య , ఉపాధ్యాయులు పీఏ సీఎస్ డైరెక్టర్ లు ఊరడి బాలకిషన్, కట్ట ఎల్లయ్య, అనుముల మల్లేశం, తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను సన్మానించిన ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం నా న్ నోటిఫైడ్ నోటిఫికేషన్ 44 ఇండ్లకు గెజిట్ నోటిఫికేషన్ చేర్పించడం పట్ల ఎమ్మెల్యే రమేష్ బాబుకి జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవ రెడ్డి కి, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు జడ్పీటీసీ మ్యాకల రవి ,సర్పంచ్ ఊరడి రాంరెడ్డి , ఎఎంసీ వైస్ చేర్మెన్ ఊరడి ప్రవీణ్ , నిర్వాసితులు ఘనంగా సన్మానం చేశారు ఈ సందర్భంగా ల సర్పంచ్ ఊరడి రాంరెడ్డి మాట్లాడుతూ, ఎం ఎల్ ఏ కి ఇండ్ల నిర్వాసితుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు, ఇంకా మా గ్రామం లో డిలెసన్ కుటుంబాలు,భూముల పరిహారం మిగిలిన, ఇండ్ల అదుగు స్థలాల పరిహారం(ఇయ్యగా మిగిలిన) అసైన్డ్ భూముల పరిహారం ఇప్పించగలరని కోరడం జరిగింది. ఎం ఎల్ ఏ రమేష్ బాబు మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం వదిలిపెట్టిన పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారం చేస్తున్నామని, త్వరలో అన్ని పెండింగ్ సమస్య లు పరిష్కారం అవుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమం కార్యక్రమం లో పీఏ సీఎస్ చేర్మెన్ రేగులపాటి కృష్ణదేవ రావు, ఉపసర్పంచ్ తాడెం శ్రీనివాస్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నడిగొట్ల హరికృష్ణ, వార్డ్ సభ్యులు బెజుగం మహేష్, తునికి నర్సయ్య, తునికి కనుక రాజు, కట్ట లావణ్యతిరుపతి,ఎరుగోక్కుల అంజలి దేవయ్య, జిల్లా కృష్ణమూర్తి, పీఏ సీఎస్ డైరెక్టర్ లు వంకాయల రాజశేఖర్, కట్ట ఎల్లయ్య, మెడికల్ రాజిరెడ్డి, పార్వతి భూమేష్, గుండెల్లి రాజు, సంతపురి మహేందర్, వంకాయల నరేష్, పార్వతి అంజయ్య,గాలిపెల్లి శ్రీనివాస్, మదురి రాజు,దాయవనపెల్లి రవీందర్,కూస మల్లయ్య, కట్ట ప్రవీణ్, గొల్లపెల్లి కొండయ్య,తాడెం కొమురయ్య, వంకాయల కొంరెష్, ఇందారం దేవయ్య, రాజయ్య, ఎంబరి రాజనర్సు,పార్వతి కనుకయ్య, తాడెం పర్శరాములు,వంకాయల లక్ష్మి, పుసవ్వ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

ప్రియురాలిపై దాడికి తెగబడి ఆపై బలవన్మరణం

లక్నో, ఫిబ్రవరి 22:ప్రియురాలికి వేరొకరితో నిశ్చితార్థం కావడంతో ఆగ్రహంతో ఆమెపై దాడికి పాల్పడిన అనంతరం వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన యూపీలోని లోని ప్రాంతంలో వెలుగుచూసింది. తన కూతురి వివాహం ఖరారు కాగా నిందితుడు కోపంతో ఆమెపై దాడి చేశాడని బాధితురాలి తండ్రి వెల్లడించారు. బాధితురాలు, నిందితుడు లోని ప్రాంతంలో నివసిస్తున్నారు.

దాడికి గురైన యువతి (22)ని చికిత్స నిమిత్తం ఢిల్లీలోని జీటీబీ ఆస్పత్రికి తరలించి ఆపై మ్యాక్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాధితురాలు కార్యాలయానికి వెళుతుండగా ఢిల్లీలోని మీట్ నగర్ ప్రాంతంలో నిందితుడు ఆమె తలపై సుత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై జ్యోతి నగర్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

తమ కూతురి వివాహం దీపక్ అనే వ్యక్తితో ఖరారైందని, అయితే తమ పొరుగింటి వ్యక్తి ఆమెను పెండ్లి చేసుకోవాలనుకున్నాడని..వేరొకరితో నిశ్చితార్థం జరగడంతో ఆమె తలపై పదునైన ఆయుధంతో దాడి చేశాడని బాధితురాలి తండ్రి తెలిపారు. బాధితురా లిపై దాడి చేసిన అనంతరం నిందితుడు లోని ప్రాంతంలోని తన నివాసంలో ఆత్మ హత్యకు పాల్పడినట్టు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి మృతదేహాన్ని జీటీబీ ఆస్పత్రికి తీసుకువచ్చారు.

ఎలుగుబంటిని హతమార్చిన నిందితుల అరెస్ట్

గంగారం, ఫిబ్రవరి 22 : ఉచ్చులో చిక్కిన ఎలుగుబంటిని హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి కారణమైన 12మందిని మంగళ వారం అరెస్ట్ చేశారు.అటవీ శాఖ రేంజర్ చలపతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని జంగాలపల్లికి చెందిన అజ్మీరా చందులాల్, బానోత్ శ్రీను, ఇస్రావత్ ఉపేందర్, గుగులోత్ గణేశ్, బానోత్ రవి, మాలోత్ ప్రవీణ్, మాలోత్ శివ, బానోత్ విజమ్, రాంసింగ్, బోడ శంకర్, రామోజీ, శ్రీను కలిసి సమీప అటవీ ప్రాంతంలో ఉచ్చులు వేసి వన్యప్రాణులను హతమార్చేవారు.

ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఉచ్చులో ఓ ఎలుగుబంటి పడడంతో దానిని హతమార్చారు. ఈ విషయం సోమవారం అటవీ అధికారులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి ఎలుగుబంటి ఎముకలు, జుట్టు సేకరించి ఫోరెన్సిక్ టెస్టులకు పంపారు.వన్యప్రాణులను హాని తలపెడితే చర్యలు తప్పవని రేంజర్ హెచ్చరించారు.

దివ్యాంగులకు స్కూటీలు అందజేత

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 8 మంది దివ్యాంగులకు గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా త్రీవీలర్ స్కూటీలను అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులకు స్వాంతన చేకూర్చేలా రూ.3వేల పెన్షన్ అందించి మనోధైర్యం నింపుతున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని కొనియాడారు.

కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మామిండ్ల తిరుపతిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆమె వీరోచిత తిరుగుబాటు భూ పోరాటానికి నాంది పలికింది : మంత్రి వేముల

నిజామాబాద్, ఫిబ్రవరి 22: వీరనారి చాకలి ఐలమ్మ భూ స్వాముల ఆధిపత్యాన్ని ఎదురిస్తూ కొనసాగించిన తిరుగుబాటు భూ పోరాటానికి నాందిగా నిలిచిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని వేల్పూర్, పడిగెల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాలను మంత్రి మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాటి భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరు కొనసాగించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు. అంతటి వీర వనిత విగ్రహాలు ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

బాంచన్ దొరా కాల్మొక్కుతా అనే స్థితిలో ఉన్న పీడితులతో బందూకులు పట్టించి దొరలను గడగడలాడించిన ఘనత ఐలమ్మదని పేర్కొన్నారు. దొరల దాష్టికాలపై సివంగిలా గర్జించిన ఐలమ్మ నడుముకు కొంగుచుడితే, దొరతనం తోక ముడిచిందన్నారు.

దొర ఇంట్లో వెట్టి చాకిరి చేసే నాటి సంప్రదాయాన్ని వ్యతిరేకిస్తూ ఐలమ్మ 40 ఎకరాల భూమిని కౌలు తీసుకుని పంట పండించిందన్నారు.

దీనిని జీర్ణించుకోలేకపోయిన దొరలు ఐలమ్మ పంటను బలవంతంగా కోసుకుని తేవాలంటూ వంద మంది అనుచరులను పంపిస్తే.. ఐలమ్మ తన నలుగురు కొడుకులతో కలిసి వంద మందిని తరిమి తరిమి తన వీరత్వాన్ని చాటిందని మంత్రి కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు భూ పోరాటానికి నాంది పలికారన్నారు.

పసుపు బోర్డు ఇవ్వండి- రైతులను ఆదుకోండి: రైతు సంఘం నేత నరసింహనాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని తెలంగాణ పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా మూడు వ్యవసాయ చట్టాల రద్దు పోరాటంలో పాల్గొన్న రైతులను కిసాన్ విజయ్ ఉత్సవ్ సమితి మంగళవారం సన్మానించింది. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కోటపాటి నరసింహ నాయుడు కిసాన్ రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 వరకు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని కేంద్రం ప్రకటించినా ఇప్పటివరకూ అన్నదాతల జీవితాల్లో ఎలాంటి మార్పూ రాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న రైతు అనుకూల విధానాలను చూసి నేర్చుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో రైతుకు పెట్టుబడి సహాయం, ఉచిత విద్యుత్, పండిన పంటను కొనడం, సమయానికి ఎరువుల అందించడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని నరసింహ నాయుడు చెప్పుకొచ్చారు.

గతంలో తాము పసుపు బోర్డ్ కోసం ఢిల్లీ వచ్చి ధర్నా చేయగా ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ తమకు ఇచ్చిన హామీలను